క్లుప్తంగా

డిప్యూటీ తహసీల్దార్‌పై చర్యలు తీసుకోండి



డిప్యూటీ తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగిన మహిళలు

సోమందేపల్లి: మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన డిప్యూటీ తహసీల్దార్ శంకర్‌పై చర్యలు తీసుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి డిమాండ్ చేశారు. 700 సర్వే నంబరులో పేదల గుడిసెలు వేసుకోగా తొలగిస్తామని రెవెన్యూ అధికారులు నోటీసులు అతికించడంపై తహసీల్దార్‌కు సోమవారం వినతి పత్రం ఇవ్వడానికి వచ్చామన్నారు. అయితే ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ ఏకవచనంతో మహిళలపై నోరు పారేసుకున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పేదల గుడిసెలు తొలగించకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఇండ్ల స్థలాల భూసాధన కమిటీ సభ్యులు నూర్జహాన్, గుర్రమ్మ, అంజినమ్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎండిన చెట్టును తొలగించండి



కదిరేపల్లి క్రాస్ వద్ద ఎండిపోయిన చెట్టు

మడకశిరరూరల్: మండల పరిధిలోని కదిరేపల్లి క్రాస్‌లో రోడ్డు పక్కన ఎండి పోయి కూలడానికి సిద్ధంగా ఉన్న చెట్టును తొలగించి ఏ ప్రమాదం జరుగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. వర్షా కాలం కావడంతో ఈదురు గాలులకు ఎండిన చెట్టు కూలిపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ సమయంలో రోడ్డుపై వచ్చే వారికి ప్రమాదం జరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధితశాఖ అధికారులు చర్యలు తీసుకుని చెట్టును తొలగించాలని కోరుతున్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

మడకశిర: పట్టణంలోని 17వ వార్డు పరిధిలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కౌన్సిలర్ సుభద్ర సోమవారం మున్సిపల్ కమిషనర్ రంగస్వామిని కలిసి విన్నవించారు. ఈ వార్డు పరిధిలోని హరిజన వీధి, కోల్డ్ స్టోరేజ్, చాకలికుంటలో తాగునీటి పథకం బోరు పని చేయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే తాగునీటి పథకానికి సంబంధించిన బోరుకు మరమ్మతు చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని కోరారు.

ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ



ఎమ్మెల్యే బాలకృష్ణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

హిందూపురం అర్బన్/ హిందూపురం: ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 64వ పుట్టిన రోజును పురస్కరించుకొని ఎస్పీ మాధవరెడ్డి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం పట్టణంలోని చౌడేశ్వరికాలనీలో ఉన్న బాలయ్య నివాసంలో ఆయన్ను కలిశారు. మరోవైపు అభిమానుల మధ్య బాలకృష్ణ కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వాస్పత్రి వద్ద అన్న క్యాంటీన్ ప్రారంభించి అన్నదానం చేశారు. హిందూపురం అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని బాలకృష్ణ తెలిపారు.

వక్కలిగ మఠాధిపతి జన్మదినం



హనుమంతనాథస్వామికి శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు

రొళ్ల: కర్ణాటక రాష్ట్రం కొరటగెర తాలూకా ఎలెరాంపురం కుంచిటి వక్కలిగ సంస్థానం మఠాధిపతి హనుమంతనాథస్వామి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాలూకా కుంచిటి వక్కలిగ సంఘం అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు తదితరులు వేడుకల్లో పాల్గొని స్వామిజీకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొత్తపాళ్యం భోజేగౌడు, సీసీ గిరి కాంతరాజు తదితరులు పాల్గొన్నారు.

సాగు విధానం మార్చి ‘నారు’

- మారిన పంటల సాగు విధానం
- నర్సరీలపైనే ఆధారపడుతున్న రైతులు



అగళి మండలం ఇనగలూరులోని మిరప నర్సరీ

అగళి: ఒకప్పుడు టమాట, మిరప పంటలు సాగు చేయాలంటే రైతులు ముందుస్తు ఏర్పాట్లు చేసుకునే వారు. రైతు పొలాల్లోనే వారికి కావాల్సిన నారు కోసం విత్తనం చల్లి మొక్కలయ్యాక పొలాల్లో నాటే వాళ్లు. ఈ పనుల కోసం కనీసం నెలరోజుల సమయం పట్టేది. అయితే టమాట, మిరప సాగు విస్తీర్ణం పెరగడం, తక్కువ సమయంలో పంట దిగుబడులు రావాలని అన్నదాతలు ఆరాట పడుతున్నారు. ఏడాదికి మూడు పంటలు సాగుచేసేలా రైతాంగం ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. దీంతో టమాట, మిరప నారుకు బదులు రెడీమేడ్‌గా మొక్కలు సరఫరా చేసే నర్సరీలు గ్రామాల్లో కుప్పలు తెప్పలుగా పుట్టుకొచ్చాయి.

మిరప సాగు అధికం

అగళి మండలంలో రైతులు ఎక్కువగా మిరప, టమాట పంటలను సాగు చేస్తుంటారు. ఇందులో భాగంగానే నర్సరీల్లో ఎక్కువగా మిరప నారును సిద్ధం చేసి రైతులకు అమ్ముతుంటారు. అగళిలో 3, , రొళ్ల 1, అమరాపురం 1, మడకశిరలో 5 నర్సరీలు అధికారికంగా ఉన్నాయి. అయితే అనధికారికంగా మరో 10 నర్సరీలు ఉంటాయని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు.

పాత పద్ధతికి స్వస్తి..

15 ఏళ్ల క్రితం టమాట, మిరప నర్సరీల మాటేలేదు. టమాట, మిరప సాగు చేసుకునే రైతులు తమ పొలాల్లో టమాట, మిరప విత్తనాలు చల్లేవారు. 20 నుంచి 30 రోజుల మధ్యలో టమాట, మిరప నారుగా మారి మొక్కలయ్యేవి. ఆ మొక్కలను రైతులు పొలాల్లో నాటుకునే వారు. ఒక రైతు ఎక్కువ నారు తీస్తే రైతులకు అరువుగా మొక్కలను ఇచ్చేవాళ్లు. ఒకరికొకరు సహకరించుకుంటూ రైతులు పంటలను సాగు చేస్తుండేవాళ్లు. అయితే ఇప్పుడు రైతాంగం మొత్తం నర్సరీల మీదనే ఆధారపడి మొక్కలను కొనుగోలు చేస్తున్నారు.

మొక్కను బట్టి ధర

నియోకవర్గంతో టమాట, మిరప ఏడాది పొడవునా రైతులు సాగు చేస్తుంటారు. విత్తనంతో నారు పోస్తే పంటల సాగుకు ఆలస్యం అవుతుందని రైతులు నర్సరీల వైపు పరుగుల తీస్తున్నారు. దీంతో నర్సరీలు నిర్వహణ వ్యాపారంగా మారిపోయింది. అగళి మండలంలోని ఉన్న నర్సరీల్లో మొక్కలను బట్టి గతంలో ఒక్క మొక్క 50 పైసల నుంచి 70 పైసలకు విక్రయించేవారు. ఇప్పుడు 75 పైసల నుంచి రూపాయి మధ్య ధరకు విక్రయిస్తున్నారు.

ఏటా 3 లక్షల మొక్కలు విక్రయిస్తాం



ప్రస్తుత పరిస్థితుల్లో దాదాపుగా రైతులందరూ నర్సరీకే వచ్చి మొక్కలు కొంటున్నారు. ఐదేళ్లుగా టమాట, మిరప, కనకాంబరాలు మొక్కల నర్సరీని నిర్వహిస్తున్నాము. ఏడాదికి 3 లక్షల నుంచి 4 లక్షల టమాట, మిరప మొక్కలు విక్రయిస్తుంటాము. పంటకు మంచి ధర పలికితే మొక్కల విక్రయం ధర పెరుగుతుంది. లేకపోతే ధర పడిపోతుంది.

– గురునాథ్ , నర్సరీ నిర్వాహకుడు, ముత్తేపల్లి

సమయం ఆదా అవుతుందనే...



“ గతంలో టమాట, మిరప, కనకాంబరాలు సాగుకు విత్తనంతో నారు పోసేవాళ్లం. పొలంలో దిబ్బ ఎరువులతో, దుక్కిచేసిన చోట విత్తనం చల్లి మొక్కలయ్యాక నాటేవాళ్లం. ఇప్పుడు నారుపోసే రైతులు మాత్రం ఎవరూ లేరు. ప్రతి ఒక్కరూ నర్సరీలపై ఆధారపడి టమాట, మిరప పంటలను సాగు చేస్తున్నారు. దీంతో సమయం ఆదా అవుతోందని మాత్రమే రైతులందరూ నర్సరీలపైనే ఆధారపడుతున్నాము.

– అమ్మజక్క, బీరనపల్లి, అగళి మండలం

మామిడి చెట్ల నరికివేత



వైఎస్సార్‌సీపీ కార్యకర్త హనుమంతరాయప్పకు చెందిన మామిడి చెట్లు నరికివేసిన దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని కేతేపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త హనుమంతరాయప్పకు చెందిన మామిడి చెట్లను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. బాధితుడి వివరాల మేరకు... కేతేపల్లిలో తన పొలంలో కాయలు కాసిన 10 మామిడి చెట్లను దుండగులు నరికి వేశారన్నారు. దీంతో తీవ్రంగా నష్టం జరిగిందన్నారు. పోలీసులు నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈమేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మరోవైపు మామిడి చెట్లను నరికి వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ లీగల్ కమిటీ సభ్యుడు వైసీ గోవర్ధన్‌రెడ్డి పోలీసులను డిమాండ్ చేశారు.

విద్యా సామగ్రి పంపిణీ



స్కూల్ బ్యాగులు అందుకున్న విద్యార్థులు

పావగడ: స్థానిక ప్రభుత్వ మోడల్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 400 మంది విద్యార్థులకు స్కూలు బ్యాగులు, నోటు పుస్తకాలు అందించారు. ప్రైవేటు కన్నా ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్యను బోధిస్తారని వక్తలు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో దేవరాజు, బీఆర్సీ వెంటేశులు, లాయర్ మల్లికార్జున, హెచ్ఎం గంగప్ప, ఆనందనాయక, వైఆర్ చౌదరి, కూరగాయల కృష్ణప్ప, కోట్ల సుబ్రహ్మణ్యం, గంగాధర నాయుడు, సుమన్, లోకేశ్, వీరభద్ర, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన ఈరలక్కప్ప



మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలసిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

గుడిబండ: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్ సోమవారం తిరుపతిలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మడకశిరలో విజయానికి దగ్గరకు వచ్చి స్వల్ప ఓట్లతో ఓడి పోవడం బాధకరమన్నారు. గెలుపోటములు సహజమని నిరుత్సాహ పడకుండా ధైర్యంగా ఉండాలన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉండి పార్టీని బలోపేతం చేయాలని ఆయన సూచించినట్లు ఈరలక్కప్ప తెలిపారు. ఏ ఏ మండలంలో ఎన్ని ఓట్లు పడ్డాయి? ఓట్ల లెక్కింపు రోజున జరిగిన విషయాలను మాజీ మంత్రికి వివరించామన్నారు. వారితో పాటు గుడిబండ సర్పంచ్ కరుణాకర్, మడకశిర నియోజకవర్గం పరిశీలకులు పోకల అశోక్‌కుమార్ తదితరులు వున్నారు.

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

రొళ్ల: ఉపాధి పథకం ద్వారా మెట్ట ప్రాంతాల్లో వివిధ రకాల పండ్ల మొక్కల పెంపకానికి రైతుల నుంచి ఇప్పటి దాకా 130 ఎకరాల వరకూ దరఖాస్తులు స్వీకరించినట్లు సోమవారం సాయంత్రం ఏపీఓ ఓబుళప్ప తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రొళ్ల మండలానికి 300 ఎకరాల్లో ఉపాధి ద్వారా మెట్ట ప్రాంతాల్లో పండ్ల తోటలు పెంపకానికి ఉన్నతాధికారుల నుంచి అనుమతి వచ్చిందన్నారు. దీంతో ఐదెకరాలలోపు మెట్ట ప్రాంతం భూములు కలిగిన సన్న, చిన్నకారు రైతులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఒక్కొక్క రైతుకు 3 ఎకరాల వరకూ అనుమతి ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. మామిడి, కొబ్బరి, ఉసిరి, అల్లనేరేడు, జామ, సపోటతో పాటు చింత, పూల తోటలు సాగు చేసుకోవడానికి అవకాశం కల్పించడం జరిగిందన్నారు. అదేవిధంగా పండ్ల తోటలు మంజూరైన రైతులకు ఏడాదిలో 10 నెలల పాటు మూడేళ్ల పాటు మొక్కల సంరక్షణ కోసం ప్రతి నెలా బిల్లులు చెల్లించడం జరుగుతుందని వివరించారు. ఆసక్తిగల రైతులు రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోను కలసి స్మాల్ ఫార్మర్ సర్టిఫికేట్‌తో పాటు ఆధార్ కార్డు, పట్టదారు పాసుపుస్తకం, 1బీతో పాటు నాలుగు పాస్‌ఫొటోలను దరఖాస్తుకు జత చేసి ఎఫ్ఏలకు లేకపోతే మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అయినా అందించవచ్చన్నారు. ఈనెలాఖరు వరకూ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని, అర్హులైన రైతులందరూఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జేడీఎస్ ఖాతాలోకి ‘పాల సంఘం’



నూతనంగా ఎన్నికైన పాల ఉత్పత్తి సహకార సంఘం సభ్యులు

పావగడ: తాలూకాలోని వదనకల్ గ్రామ పాల ఉత్పత్తి సహకార సంఘానికి సోమవారం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో జేడీఎస్ పార్టీకి చెందిన భాస్కరరెడ్డి అధ్యక్షుడిగా, విజయ నరసింహశాస్త్రి ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారితో పాటు 9 మంది సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలో గెలుపొందిన నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులను స్థానిక మాజీ ఎమ్మెల్యే కేఎం తిమ్మరాయప్ప, జేడీఎస్ నాయకులు రాజగోపాల్, శివప్ప, మోహన్ సాసలకుంట, రాజప్పరెడ్డి, పాలయ్య, జయరామిరెడ్డి తదితరులు అభినందించారు.

న్యాయం జరిగే వరకూ పోరాటం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్

హిందూపురం: పట్టణానికి చెందిన న్యాయవాది సంపత్‌కుమార్ హత్యపై జ్యుడీషియల్ దర్యాప్తు జరిపించాలని అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం హిందూపురం పట్టణానికి విచ్చేసిన ఆయన బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తర్వాత సంపత్ సమాధి వద్దకు వెళ్లి నివాళులర్పించారు. అనంతరం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సంపత్‌కుమార్ కుటుంబానికి న్యాయం జరిగే వరకూ పోరాటం ఆపబోమన్నారు. దళిత న్యాయవాదిని ఇంత దారుణంగా, కిరాతకంగా నరికి చంపడం ఆటవీకమన్నారు. ఇంత దారుణం జరిగినా జిల్లా ఎస్పీ ఈ కేసు విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధకరమన్నారు. పోలీసు అధికారులు ఈ ఘటనపై అశ్రద్ధ చూపుతున్నారని విమర్శించారు. పోలీసు యంత్రాంగం వెంటనే స్పందించి నిందితులను పట్టుకొని కఠిన శిక్ష పడేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు బీఎస్పీ శ్రీరాములు, ఎంఎస్ఎఫ్ఐ రవికుమార్, మడకశిర పాండు రంగమూర్తి, సోమన్న, బసవరాజు ఎంఎస్ మూర్తి, కేవీపీఎస్ నాయకులు రమణ నాగరాజు, టిప్పుసుల్తాన్ ముస్లిం నగరా నాయకులు ఉమర్ ఫరూక్, దళిత సంఘాల నాయకులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న కారును ఢీకొన్న కంటైనర్



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

పెనుకొండ రూరల్: ఆగి ఉన్న కారును కంటైనర్ ఢీ కొన్న సంఘటన మండల పరిధిలోని దుద్దెబండ వద్ద సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు మేరకు ... దుద్దెబండ గ్రామంలోని పెద్దమ్మ గుడి ఎదురుగా మలుపు వద్ద ఆగి ఉన్న కారును కియా అనుబంధ పరిశ్రమలోకి వెళ్లే కంటైనర్ ఢీ కొంది. దీంతో కారు ముందు భాగం పాక్షికంగా దెబ్బతింది. వెంటనే అప్రమత్తమైన కంటైనర్ డ్రైవర్ వేగాన్ని నియంత్రించడంతో కారులో ఉన్న డ్రైవర్‌కి ప్రాణాపాయం తప్పింది.

పాఠ్య పుస్తకాలకు ఇండెంట్ పెట్టాలి

అమరాపురం: మండలంలోని ప్రైవేటు పాఠశాలలు తప్పనిసరిగా ప్రభుత్వం ద్వారా సరాఫరా చేసే పాఠ్య పుస్తకాల కోసం ఇండెంట్ నమోదు చేయాలని ఎంఈఓ 1 రాఘవయ్య తెలిపారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మండలంలోని ప్రైవేటు పాఠశాలల హెచ్ఎంలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఇంత వరకూ పాఠ్య పుస్తకాల కోసం నమోదు కార్యక్రమం చేపట్టలేదన్నారు. వెంటనే విద్యాశాఖ వెబ్‌సైట్‌లోకి వెళ్లి పాఠ్య పుస్తకాల కోసం ఇండెంట్ పెట్టాలని సూచించారు. ఎవరైతే ఇంతవరకూ ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదో వెంటనే చే యాలని సూచించారు.

రేపు వేలం పాట

అమరాపురం: స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలోని వివిధ వనరులకు బుధవారం ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఈఓ భాస్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో వేలం పాట ఉంటుందన్నారు. దినసరి సంత, మటన్ మార్కెట్, వారపు సంత, బస్టాండులకు వేలంపాట నిర్వహిస్తున్నామన్నారు. పాల్గొనే వారు రూ.10 వేలు ధరావత్తు, మటన్ మార్కెట్‌కు రూ.5 వేలు చెల్లించి పాల్గొనాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



చికిత్స పొందుతున్న మంజునాథ్

పెనుకొండ: పట్టణంలోని మడకశిర రోడ్డులో జర్నలిస్ట్ కాలనీ వద్ద ద్విచక్ర వాహనం బోల్తాపడిన ఘటనలో మంజునాథ్ అనే యువకుడు గాయపడ్డాడు. సోమవారం సాయంత్రం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వివరాల్లోకెళితే... పట్టణానికి చెందిన మంజునాథ్ పని నిమిత్తం మడకశిరకు ద్విచక్ర వాహనంలో వెళ్లి తిరిగి వస్తుండగా పట్టణ సమీపంలోని జర్నలిస్ట్ కాలనీ వద్ద కుక్క అడ్డురావడంతో వాహనం అదుపు తప్పింది. గాయపడిన మంజునాథ్‌ను స్థానిక ప్రభుత్వ సర్వజానాస్పత్రికి తరలించారు.



చీపులేటి వద్ద వేరుశనగ విత్తుతున్న రైతులు

విత్తన సాగులో అన్నదాతలు

మడకశిర రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు సోమవారం విత్తన శుద్ధి చేసి వేరుశనగ విత్తనాలను విత్తుకున్నారు. నైరుతి రుతుపవనాలతో కురిసిన వర్షాలకు తోడు సకాలంలో ఆర్బీకేల ద్వారా సబ్సిడీ విత్తన కాయలు పంపిణీ చేయడంతో ముందస్తుగా భూములను సిద్ధం చేసుకుని ఖరీఫ్ పంటను సాగు చేస్తున్నామని రైతులు చెబుతున్నారు. అదునులోనే వేరుశనగ పంట సాగు చేసుకోవడానికి ఎంతో అనుకూలంగా ఉందన్నారు. వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి విత్తనాలు విత్తుకుంటున్న రైతులకు పలు సూచనలు, సలహాలు అందించాలని వారు కోరారు.

సీనియర్ మేనేజర్‌గా ప్రసాద్ బాధ్యతలు



కెనరా బ్యాంకులో బాధ్యతలు తీసుకున్న మేనేజర్ ప్రసాద్

అమరాపురం: స్థానిక కెనరా బ్యాంకు సీనియర్ మేనేజర్‌గా బీబు ప్రసాద్ బీరా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ఇక్కడ విధులు నిర్వరిస్తున్న ప్రహ్లాద్ తమిళనాడుకు బదిలీపై వెళ్లారు. ఆ స్థానంలో ఒరిస్సా రాష్ట్రం నుంచి బీబు ప్రసాద్ బీరా బదిలీపై ఇక్కడికి వచ్చారు. అలాగే అసిస్టెంట్ మేనేజర్‌గా అనంతపురం జిల్లా గుత్తి కెనరా బ్యాంకు నుంచి బదిలీపై వచ్చిన సురేష్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు, ఖాతాదారులకు, మహిళా సంఘాలకు మెరుగైన సేవలందించడమే తమ ధ్యేయమన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఉద్యోగులు వారికి స్వాగతం పలికారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

సోమందేపల్లి: మండలంలోని చాలకూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త లింగప్ప (60) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసప్ప, సీనియర్ నాయకుడు చంద్రారెడ్డి గ్రామానికి చేరుకొని లింగప్ప మృతదేహాన్ని సందర్శించి పూల మాల వేసి నివాళులర్పించారు. మృతుడి సోదరుడు పరంధామను ఓదార్చారు.





మరవకొత్తపల్లి సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌పై కూలిన వేప చెట్టు

చిలమత్తూరు చెరువు కట్టపై విరిగిపోయిన చింతచెట్టు

నేలకొరిగిన చెట్లు

చిలమత్తూరు: మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. గాలివాన ఎక్కువవడంతో చిలమత్తూరు చెరువు కట్టపై ఏళ్లనాటి చింత చెట్టుకు సంబంధించి పెద్ద కొమ్మలు విరిగిపడ్డాయి. మరవకొత్తపల్లి సమీపంలోని పొలాల్లో రైతులు ఏర్పాటు చేసుకొన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై ఆదివారం వేపచెట్టు విరిగిపడింది. విద్యుత్‌శాఖ అధికారులు చెట్టును తీసివేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. మరో వైపు వరుస వర్షాలతో పలు చోట్ల చెక్‌డ్యామ్‌లు, గుంతల్లో నీరు వచ్చి చేరింది.

హక్కుల సాధనకు నిరంతర పోరాటం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

హిందూపురం: కార్మికుల హక్కుల సాధనకు నిరంతర పోరాటం సాగిస్తామని ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి బాబు అన్నారు. స్థానిక మున్సిపల్ ఆఫీసులోని జేఏసీ కార్యాలయంలో పట్టణ ఏఐటీయూసీ కార్యదర్శి మారుతీరెడ్డి అధ్యక్షతన కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల హక్కుల కాపాడటానికి ఏఐటీయూసీ సభ్యత్వ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఈనెలలో నూజివీడులో రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ ఉపాధ్యక్షుడు సమీవుల్లా, జియా, శివప్ప, జిలాన్, పట్టణ సహాయ కార్యదర్శి ముత్యాలప్ప, కమల్ బాషా పాల్గొన్నారు.

కళామతల్లి సేవలో అంజినప్ప

ధర్మవరం రూరల్: ఓ వైపు ఉపాధ్యాయ వృత్తి కొనసాగిస్తూనే.. మరోవైపు కళామతల్లి సేవలో ఎస్.అంజినప్ప తరిస్తున్నారు. ×కళాభిషేకం¶ కార్యక్రమం ద్వారా ఎంతోమంది కళాకారులను ప్రోత్సహిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు ఇటీవలే విజయవాడలో ప్రశంసా పత్రం అందించి ఘనంగా సత్కరించింది. ఎస్.అంజినప్ప ధర్మవరం మండల పరిధిలోని పీసీఎంఆర్ పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. విద్యార్థులకు చక్కగా చదువు చెప్పడమే కాకుండా చిత్రకారునిగా, అభ్యుదయ భావాలతో సామాజిక చైతన్య గీతాలు రాసి, పాడడం, సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్నారు. తేనె తెలుగు కల్చరల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేద కళాకారులకు ఆర్థిక సాయం చేయడంతో పాటు గ్రామీణ ప్రాంతాలలో ఉండే కళాకారులను ప్రోత్సహిస్తున్నారు.